
# ఫ్లాష్ బ్యాక్




**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

## హాస్య నటుడిగానూ కొనసాగుతాను - ఆలీ

### (విజయచిత్ర – 1994, మే సంచిక నుంచి )

'ప్రెసిడెంట్ పేరమ్మ' చిత్రం ద్వారా 1979 లో బాలనటుడుగా చిత్ర రంగానికి పరిచయమైన ఆలీ ఇంత వరకూ తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో దాదాపు 225 చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం ఆలీ 'యమలీల' చిత్రం ద్వారా కథానాయకుడుగా ప్రేక్షకులకు పరిచయమవుతున్నారు. ఆ సందర్భంగా 'విజయచిత్ర' ఆలీతో జరిపిన గోష్టిలోని కొన్ని ముఖ్యాంశాలను ఇక్కడ ప్రచురిస్తున్నాము.




★★★★★★★★★★

నా సినీరంగ ప్రవేశం గురించి...

"మా స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి. మా నాన్న గారు మహమ్మద్ భాషా. మాకు రాజమండ్రిలో 'చిల్డ్రన్స్ గార్మెంట్స్' షాపు వుంది. చిన్నప్పటి నుంచి నాకు సినిమాలంటే మహా పిచ్చి. విడుదలైన ప్రతి సినిమాని తప్పకుండా చూసే వాడ్ని. స్కూల్లో చదువుకునే రోజుల్లో స్కూలు ఎగ్గొట్టి ఉదయం ఆటలకి, మధ్యాహ్నం ఆటలకీ వెళ్ళే ఆడ్ని. సినిమా మీద చూపించే శ్రద్ధలో పదో

వంతు కూడా చదువు మీద చూపించే వాడ్ని కాదు. దాంతో నా చదువు ఎనిమిదో క్లాసు దాటి ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యలేక పోయింది. నేను చూసిన సినిమాల ప్రభావం నా మీద విపరీతంగా పని చెసింది. అదీ ఏస్థాయిలో అంటే, చూసిన ప్రతి సినిమాలోని నటీనటులను అనుకరిస్తూ నటించడం. నృత్యాలు చేయడం చేస్తూ వుండేవాడ్ని. అది చూసి నా మిత్రులంతా వినోదించే వాళ్ళు. అది క్రమంగా 'మిమిక్రీ' సాధనకు బీజమై, రంగస్థలం మీద 'మిమిక్రీ' కార్యక్రమాలు ఇచ్చే స్థాయికి చేరుకుంది రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో అనేక 'మిమిక్రీ ప్రదర్శనలు' ఇచ్చాను.

ఇలా వుండగా 1979 లో ఓ సారి రాజమండ్రిలో జిత్ మోహన్ మిత్రా ఆర్కెస్ట్రా వారితో కలిసి రంగస్థలం మీద నేను 'మిమిక్రీ' ప్రదర్శన ఇచ్చినప్పుడు, 'ప్రెసిడెంట్ పేరమ్మ' చిత్రం షూటింగ్ నిమిత్తం అక్కడికి వచ్చిన సుప్రసిద్ధ దర్శకులు కె.విశ్వనాథ్ గారు చూడడం తటస్థించింది. ఆ రోజు ఆ కార్యక్రమం పూర్తయిన తర్వాత వారు నన్ను ఎంతో అభినందించి 'ప్రెసిడెంట్ పేరమ్మ' చిత్రంలో 'బాలనటుడి'గా నా చేత నటింప జేశారు. అలా నా పదవ ఏట అనుకోకుండా నా చిత్రరంగ ప్రవేశం జరిగింది."

నా జీవితంలో మరచిపోలేని ముఖ్య ఘట్టాలు...

"నేను పరిశ్రమలో నటుడుగా ప్రవేశించిన కొత్తలో 'నిండు నూరేళ్ళు', 'నిప్పులాంటి మనిషి' చిత్రాల్లో నేను ధరించిన పాత్రలు చూసి భారతీరాజా గారు 'సీతాకోక చిలుక' చిత్రంలో నటించే అవకాశం ఇచ్చారు. ఆ చిత్రంలో నేను ధరించిన పాత్రకు 1981వ సంవత్సరానికి గాను 'ఉత్తమ బాలనటుడు'గా అప్పటి, ఇప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర రెడ్డి గారి నుండి నంది బహుమతిని అందుకున్నాను. ఇది నా జీవితంలో మరిచిపోలేని సంఘటన.

అనంతరం సురేశ్ ప్రొడక్షన్స్ అధినేత డి.రామానాయుడు గారు తాము నిర్మించిన 'దేవత' తమిళంలో పునర్నిర్మించినప్పుడు అందులో సుప్రసిద్ధ తమిళ హాస్య నటుడు కీ.శే|| తేంగాయ్ శ్రీనివాసన్ గారికి కొడుకుగా నటించే అవకాశం కల్పించి – నా తమిళ చిత్ర రంగ ప్రవేశానికి దోహదం చేశారు. ఆ చిత్రంలో నా నటనను చూసి మలయాళ దర్శకులు సురేష్ 'ఒరు స్వప్నంబోలె' అనే చిత్రం ద్వారా మలయాళ చిత్రరంగానికి నన్ను పరిచయం చేశారు. భాష రాకపోయినా, 'మిమిక్రీ' విద్య ద్వారా నాకు అలవడిన 'టైంసెన్స్' ఆధారంగా మలయాళంలో సంభాషణలు పలకడం చూసి – ఆ చిత్ర దర్శకులు సురేశ్ నన్ను ఎంతగానో మెచ్చుకుని, మరో మూడు మలయాళ చిత్రాల్లో నటించే అవకాశం ఇచ్చి ప్రోత్సహించారు. అలా క్రమంగా అంబరీష్ కథానాయకుడుగా నటించిన 'ఏకలవ్య' చిత్రం ద్వారా కన్నడ చిత్ర రంగానికి పరిచయమయ్యాను. అనంతరం 'తోఫా', 'నయాకదమ్', 'ప్రేమ్ ఖైదీ' మొదలుగా ఏడు హిందీ చిత్రాల్లో నటించే అవకాశమూ కలిగింది.

★★★★★★★★★★

పెద్దయిన తర్వాత నటుడుగా నాకొక గుర్తింపునీ,పలు చిత్రాల్లో నటించే అవకాశాన్నీ లభింప జేసిన చిత్రం 'రాజేంద్రుడు గజేంద్రుడు'.

బాలనటుడుగా పలు చిత్రాల్లో నటించి, నటనలో అనుభవం బాల నటుడిగా తగిన గుర్తింపూ నాకు లభించాయి. కానీ, నేను ఎదిగిన తర్వాత అటు బాల పాత్రలకీ, ఇటు యువ పాత్రలకీ సరిపోని దశలో అవకాశాలు లభించక చాలా అవస్థపడ్డాను. ఓ సందర్భంలో అయితే, నిరాశ చెంది ఇంటికెళ్ళిపోయి వ్యాపారం చేసుకుంటూ బ్రతుకుదామనే నిర్ణయానికి వచ్చాను.

అటువంటి పరిస్థితుల్లో ప్రముఖ దర్శకులు – నిర్మాత అయిన ఎస్.వి.కృష్ణారెడ్డి గారు తమ 'రాజేంద్రుడు – గజేంద్రుడు' చిత్రంలో నటించే అవకాశాన్ని కల్పించారు. ఆ చిత్రంలో నేను ఉపయోగించిన ఊత పదం 'చేట' విశేషంగా జనాదరణ పొంది నాకొక గుర్తింపునీ, తగినన్ని అవకాశాల్నీ తెచ్చి పెట్టి, 'నటుడు'గా పరిశ్రమలో నిలదొక్కు కోడానికి దోహదం చేసింది.

★★★★★★★★★★★★★★★★★★★★★

ఎదురు చూడని హీరో ఛాన్సు...

1993, అక్టోబర్ 14న 'మనీషా ఫిలిమ్స్' కృష్ణారెడ్డి గారి ఆఫీసు నుంచి పిలుపొచ్చింది. 'సరే'నని వారి ఆఫీసుకి వెళ్ళాను. అక్కడ ఆయన వారి తదుపరి చిత్రంలో నటించడానికి 'అగ్రిమెంట్' కాగితాల మీద సంతకం పెట్టమని, నేను ఎదురు చూడని మొత్తాన్ని 'అడ్వాన్స్' గా ఇచ్చారు. 'అగ్రిమెంట్' కాగితాల్లో 'హీరో'గా అని ఉండడం చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాను. 'అగ్రిమెంట్' పత్రాలు తారుమారయ్యాయేమోనని మరోసారి చదివి – 'ఇదేమిటి సార్?' అన్నాను కృష్ణారెడ్డి గారితో. 'అవును నువ్వే ఈ చిత్రంలో హీరోవి' అన్నారు ఆయన. నేను ఇంకా ఏదో అనబోయేలోగా – 'నువ్వు చేయ్య గలవు. మాకు తెలుసు' అని భుజం తట్టి ప్రోత్సహించారు. ఆ విధంగా, ఎదురు చూడని విధంగా హీరో ఛాన్సు నన్ను వరించినందుకు ఓ ప్రక్క ఆనందంగానే వున్నా మరో ప్రక్క వారి నమ్మకం వమ్ముగాకుండా, 'హీరో' గా నేను ఎంత వరకూ రాణించగలనా – అనే కలవరమూ లోలోన ఎంతగానో వుంది.

★★★★★★★★★★★★★★★★★★★★★

హాస్య నటుడిగానూ కొనసాగుతాను...

'యమలీల' చిత్రంలో కథానాయకుడిగా నటించే అవకాశం వచ్చిందని – ఇకమీదట కథానాయకుడుగానే స్థిర పడాలన్న ఆలోచన నాకు లేదు. అవకాశం వచ్చినప్పుడు 'కథానాయకుడు'గా నటిస్తూ మరో ప్రక్క హాస్యనటుడిగానూ కొనసాగుతాను. ప్రస్తుతం హలో్బ్రదర్, మరో క్విట్ ఇండియా, జైలరు గారి అబ్బాయి, కిష్కింద కాండ, ఆర్.కె.అసోసియేట్స్. సురేష్ ప్రొడక్షన్స్ వారు నిర్మించే చిత్రాల్లో హాస్య పాత్రలు పోషిస్తున్నాను. 'బేవార్స్ బ్రదర్స్', 'మిస్టర్ మాయగాడు' చిత్రాలలో కథానాయకుడుగా నటిస్తున్నాను. ఇంకా హీరోగా నటించే అవకాశాలు చాలానే వస్తున్నాయి. కాని, 'యమలీల' చిత్రం విడుదల అయిన తర్వాత అంగీకరిస్తాను.

–'స్పందన'

★★★

COMMENTS